

సాలెహ్‌నగర్ ఈద్గాలో ప్రసంగాన్ని వింటున్న ముస్లింలు

ఘనంగా రంజాన్

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: జిల్లా వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దల ప్రసంగాలు విన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గల పురానీ (ఖదీమ్‌షాహి) ఈద్గాలో సయ్యద్‌షా మొహమ్మద్ ఖాద్రి నమాజ్ చేయించి సందేశమిచ్చారు. చింతకుంట ఈద్గాలో ముఫ్తి ఎత్తెమాదుల్ హక్ నమాజ్ చేయించగా మొహమ్మద్ ఖైరొద్దీన్ సందేశమిచ్చారు.

సాలెహ్‌నగర్ ఈద్గాలో కరీంనగర్ సదర్ ఖాజీ మన్‌ఖబత్‌షాఖాన్ నమాజ్ చేయించగా ముఫ్తీ మహమ్మద్ ఘియాస్ మొహియొద్దీన్ సందేశ మిచ్చారు.

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

బైపాస్‌రోడ్‌లోని ఈద్గాహ్ అహ్మద్‌లో మౌలానా మొహమ్మద్ యూసుఫ్ మహమ్మదీ సందేశమివ్వగా మహమ్మద్ యూనుస్‌మదనీ నమాజ్ చేయించారు. కార్యక్రమంలో జమైతే అహ్లే హదీస్ షహరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. ఆయా మండల, గ్రామ కేంద్రాల్లో గల మసీద్‌లు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలకు ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బి వినోద్ కుమార్, మేయర్ సునీల్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. తన నివాసానికి వచ్చిన ముస్లింలకు మేయర్ సునీల్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.



భారీ బందోబస్తు.. వివిధ శాఖల సిబ్బంది సేవలు

పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ విభాలకు చెందిన అధికారులు, పోలీసులు ఆయా చోట్ల బందోబస్తులో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రార్థనలయ్యేంతవరకు దారి మళ్లింపు చర్యలు తీసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సమస్యాత్మక ప్రాంతాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. వైద్య, ఆరోగ్య, ఫైర్, మున్సిపల్ విభాగాల సిబ్బంది సేవలందించారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రేకుర్తి రహదారిలో పెద్ద సంఖ్యలో ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

శరణాగతి చిత్తశుద్ధితో చేయాలి

చిన్న జీయర్ స్వామి



తీర్థగోష్ఠి నిర్వహిస్తున్న చిన్న జీయర్‌స్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: సంపూర్ణ శరణాగతిని చిత్తశుద్ధితో చేయాలని, భరతుడు, విభీషణుడు, శబరి వంటివారు అలా ఆచరించి మోక్షాన్ని పొందారని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో గురువారం ఉదయం, సాయంత్రం ఆయన ప్రవచనం చేశారు. రామాయణం మహిమాన్వితమైందని, పారాయణ, ప్రవచన, హోమాదుల ద్వారా కోరిన కోర్కెలు తీరుతాయని అన్నారు. రాముని ముందు నాడు లవకుశులు 27 రోజుల పాటు 20 సర్గలు గానం చేశారని అన్నారు. రామ రాజ్యంలో సుభిక్షం, సుఖ సంతోషాలు ఉండేవని, కరువు కాటకాలకు తావు లేదన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, యాద కిషన్, ఎల్ భూపతిరావు, ఎస్ వెంకటేశం, వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

మహాత్మా జ్యోతిబా పూలే సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ పమేలాసత్పతి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే త్యాగాలు, సమాజానికి ఆ మహనీయుడు అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ పమేలా సత్పతి కొనియాడారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని శాతవాహన యూనివర్సిటీ సర్కిల్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆశలు, ఆశయాలు, త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బి శ్రీనివాస్, జిల్లా బీసీ సంక్షేమాధికారి అనిల్ ప్రకాశ్ కిరణ్, అసిస్టెంట్ ఆఫీసర్ రాజ్ మనోహర్ రావు, అర్బన్ తహసీల్దార్ ఎం రమేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సాక్షిగా అబద్ధాలు

- ఆరు గ్యారెంటీలు ఎంత మందికి ఇచ్చారు
- కాంగ్రెస్‌కు అభ్యర్థి కరువు
- బీఆర్ఎస్‌కు డిపాజిట్లు గల్లంతు
- 19న మొదటి సెట్, 25న మరో సెట్ నామినేషన్
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కొండగట్టు అంజన్న సాక్షిగా మంత్రి పొన్నం ప్రభాకర్ అబద్ధాలు చెప్పారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిసభ్యుడు బండి సంజయ్ కుమార్ విమర్శించారు. గురువారం నగరంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ మండల ధ్యక్షులు, మండల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే ఎంత మందికి ఇచ్చారో చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. ఒక్క మహిళకైనా 2500 ఇస్తున్నారా, రైతులకు వరి ధాన్యంపై 500 బోనస్, 15 వేల రైతు భరోసా, విద్యార్థులకు 5 లక్షల భరోసాకార్డు, వృద్ధులు, వితంతువులకు నాలుగు వేల ఫించన్, రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కరీంనగర్‌కు అభివృద్ధి చేసి ఉంటే హుస్నాబాద్‌కు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు.

తాను రోడ్ల విస్తరణ, కరీంనగర్ అభివృద్ధికి 12 వేల కోట్ల రూపాయలు నిధులు తీసుకు వచ్చానన్నారు. అన్ని తానే చేసినట్లు బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని, కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థే కరువయ్యాడన్నారు. ఈ నెల 19న మొదటి సెట్ నామినేషన్ నిరాడంబరంగా వేస్తానని, 25న మరో సెట్ నామినేషన్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వేల మందితో వేస్తున్నట్లు ప్రకటించారు. సర్వేలన్నింటిలో కరీంనగర్‌లో బీజేపీ గెలుపు ఖాయమని నివేదిక వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ కొత్త ప్రచారానికి తెరలేపిందని, వాళ్ల అభ్యర్థి మంచోడని, పార్టీ మంచిది కాదని, మూడు లక్షల మెజారిటీతో గెలుస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. మంచోడనే ముసుగులో కేసీఆర్ కుటుంబానికి దోచిపెట్టడం, ఆయన కుటుంబానికి దోచుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని, బీజేపీని ఓడించడానికి కుట్రలు పన్నుతున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

ఐదు సంవత్సరాల్లో కాంగ్రెస్ నాయకులు ఏనాడైనా కరీంనగర్ ప్రజల కోసం పోరాటం చేశారా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజల పక్షాన బీజేపీ నిలిచిందన్నారు. పోరాటాలు చేస్తే కేసులు, లాఠీల దెబ్బలు తిన్నది బీజేపీ నాయకులు, కార్యకర్తలన్నారు. 150 రోజులు 1,600 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నామన్నారు. బీజేపీ పోరాటాల వల్లే బీఆర్ఎస్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. అది కలిసి వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లు ప్రజలకు బీజేపీ కట్టబెడుతున్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థే దొరకడం లేదని, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి అభ్యర్థిని తీసుకువస్తారా అని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా మోదీ గాలి వీస్తున్నదని, ఈ అవకాశాన్ని బీజేపీ కార్యకర్తలంతా వినియోగించుకుని ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి అత్యధిక మెజారిటీతో బీజేపీ గెలిపించాలన్నారు. సమావేశంలో కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, బొమ్మ శ్రీరాం పాల్గొన్నారు.

కాలుష్యం చిమ్ముతున్న డంపింగ్ యార్డు

- ఉక్కిరిబిక్కిరవుతున్న వాహనదారులు
- రోగాల బారిన పడుతున్న స్థానికులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: కరీంనగర్‌లో డంపింగ్ యార్డు కాలుష్య విషాన్ని చిమ్ముతోంది. గుట్టలుగుట్టలుగా పేరుకు పోయిన డంపింగ్ యార్డులోని చెత్తను తొలగించేందుకు బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టినా అది ఒక అడుగు ముందకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. దీంతో సమస్యకు పరిష్కారం లభించకపోగా మరింత జఠిలమవు తోంది. కొన్ని రోజులుగా డంపింగ్‌యార్డులో చెత్త నుంచి మంటలు వెలువడుతుండడంతో అగ్నిమాపకశాఖ నాలుగు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేస్తున్నది. టన్నులకొద్ది పేరుకుపోయిన చెత్త చెదారం గుట్టపై మంటలు ఆర్పివేస్తున్నప్పటికి కొద్దిసేపటికే మరోచోట నుంచి మంటలు, పొగ వెలువడుతున్నాయి. హైదరాబాద్- రామగుండం బైపాస్ రోడ్డులోని దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన ఈ డంపింగ్‌యార్డులో చెత్తను తగ్గించాలని నగరపాలక సంస్థ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. తడి, పొడిచెత్తను వేరు చేసి తడిచెత్తతో సేంద్రీయ ఎరువులు, పొడి చెత్తను ఎక్కడికక్కడే డిస్పోజ్ చేయడంతోపాటు గుట్టలా పేరుకుపోయిన చెత్తను తగ్గించేందుకు బయోమైనింగ్ చేయాలని నిర్ణయించారు.

నత్తనడకన బయోమైనింగ్

స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా బయోమైనింగ్ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తిచేయాలనే ఒప్పందంతో 16.5 కోట్ల రూపాయల ప్రాజెక్టు పనులను 2022 ఫిబ్రవరిలో ఓ సంస్థకు అప్పగించారు. ఆరంభ శూరత్వమన్నట్లు కొద్దిరోజులు వేగంగా బయోమైనింగ్ ప్రక్రియను ప్రారంభించి గత ఏడాది మేలో నిలిపివేశారు. దీనితో మున్సిపల్ అధికారులు ఆ సంస్థకు నోటీసులు ఇవ్వడంతో తిరిగి ఇటీవల బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కాంట్రాక్టు అప్పగించి దాదాపు రెండేళ్లు అవుతున్నా నేటికీ చెత్త గుట్టలు తగ్గడం లేదు. మండుతున్న ఎండలతో చెత్తగుట్ట నుంచి మంటలు చెలరేగుతున్నాయి.

డంపింగ్ యార్డులో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు చెత్త పేరుకు పోగా అందులో నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకు 64,900 మెట్రిక్ టన్నుల చెత్తను మాత్రమే శుద్ధి చేశారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గత పాలకవర్గాలు ప్రభుత్వం పై ఒత్తిడి తేవడంతో ముగ్దుంపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని డంపింగ్‌యార్డుకు కేటాయించగా స్థానికులు డంపింగ్ యార్డు ఏర్పాటు ను అడ్డుకోవడంతో అది అక్కడే ఆగిపోయింది.

మంటలు, పొగతో కాలుష్యం

వేసవి వచ్చిందంటే చాలు డంపింగ్ యార్డులో మంటలు చెలరేగుతున్నాయి. అందులో నుంచి దుర్గంధభరితమైన దుర్వాసన, దట్టమైన పొగ వెలువడుతోంది. గాలిలో చిన్నచిన్న చెత్త రేణువులు కలిసి పరిసర ప్రాంతాల్లోకి వ్యాపిస్తున్నాయి. కొద్ది రోజులుగా బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టినా గడువులోగా చెత్తను పూర్తిగా శుద్ధి చేయక పోవడంతో ఈయేడు కూడా మళ్లీ మంటలు వ్యాపించాయి. వారం, పదిరోజులుగా చెత్త కాలి పోయి దుర్గంధం, దట్టమైన పొగ కాలుష్యంతో బైపాస్ రోడ్డు నుంచి వెళ్లే వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రమాదాలూ జరుగుతున్నాయి.

ఇక డంపింగ్‌యార్డు పరిసర ప్రాంతాలైన ఆటోనగర్, అల్గునూర్, సదాశివపల్లి, కోతిరాంపూర్, అలకాపురికాలనీ, కమాన్, సిక్కువాడ వరకు పొగ వ్యాపిస్తోందని, దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్తను వేగంగా శుద్ధి చేయడంతోపాటు తిరిగి ఇక్కడ చెత్త గుట్ట పేరుకుపోకుండా చెత్తను ఎక్కడికక్కడ తగ్గించి తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

డంపింగ్‌యార్డును సందర్శించిన కాంగ్రెస్ నేతలు

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, నాయకులు మాచర్ల ప్రసాద్, నడిపెల్లి అశోక్‌రావు, కట్ల సతీష్, ఇతర కాంగ్రెస్ నాయకులు డంపింగ్‌యార్డును సందర్శించారు. డంపింగ్‌యార్డు సమస్యపై మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్, మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు అంజన్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని చెప్పారు. బయోమైనింగ్ ప్రక్రియ ఎందుకు వేగంగా పూర్తిచేయలేదని, చెత్త సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని, పాలకవర్గం, అధికారులు ఏమి చేస్తున్నారని అంజన్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్య నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్ అనే ఉపాధ్యా యుడి సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు డిమాండ్ చేశారు. గురువారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాడుగుల రాములు మాట్లాడుతూ సెయింట్ జాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి మూల్యంకనం విధుల్లో భాగంగా బుధవారం స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రాగంపేట చంద్రశేఖర్‌ను స్పాట్ విధులు, సర్వీసు నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఫోన్‌లో మాట్లాడు తున్నాడనే కారణంతో అక్రమంగా అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇలాంటి చిన్న కారణంతో సస్పెండ్ చేస్తే చివరకు ఒక్కరు కూడా స్పాట్ అయ్యే వరకు మిగులరని అన్నారు. చిన్న తప్పులకు పెద్ద శిక్ష వేయడం సరికాదని, కనీసం సంజాయిషీ కూడా కోరకుండా చర్యలు తీసుకోవడమేమిటని ప్రశ్నిం చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, రాగంపేట చంద్రశేఖరావు, జిల్లా ఉపాధ్య క్షులు ఎన్.బాలయ్య, జానకి, వి.బాల య్య, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై స్వామివారల విహారం



అశ్వ వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 11: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భం గా పార్వతీరాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివార లు గురువారం అశ్వవాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల మూడోరోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేక ములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన అశ్వవాహ నంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బుచ్చిరాంరెడ్డి(ఫైల్)

గంగాధర/చందుర్తి, ఏప్రిల్ 11: గంగాధర మండలం కురిక్యాల వద్ద ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాల ప్రకారం గురువారం రాజన్నసిరి సిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన నాయిని బుచ్చిరాంరెడ్డి (40) జీవనోపాధి కోసం కొత్తపల్లిలో ఉంటు న్నాడు. ద్విచక్రవాహనం(టీఎస్ 7ఈఎల్6 90 7)పై గురువారం ఉదయం స్వగ్రామ మైన మర్రిగడ్డ గ్రామానికి వచ్చి నర్సింగా పూర్ గ్రామంలో ఉంటున్న కూతరు దగ్గరికి వెళ్లాడు. అ నంతరం కొత్తపల్లికి వెళుతుండగా ఆ సమయంలో కరీంనగర్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళుతున్న ఓ వ్యాను(సీజీ4ఎన్ఎక్స్4779) గంగాధర మండలం కురిక్యాల మూల మలుపు వద్ద బుచ్చిరాంరెడ్డి వాహనాన్ని ఢీ కొట్టిం ది. కిందపడ్డ బుచ్చిరాంరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. 108లో కరీం నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యా ప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వందశాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలి

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కరీంనగర్ పార్లమెంట్‌పరిధిలో వంద శాతం ఓటింగ్‌కు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని రంగినేని గార్డెన్స్‌లో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ బూత్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోని కార్యకర్తలు సైతం బీజేపీకే ఓటేసేందుకు సిద్ధమయ్యారన్నారు. దేశానికి ప్రధానిగా మోదీ పట్ల విశ్వసనీయత ప్రదర్శిస్తున్నారన్నారు. ఏడాది క్రితమే ప్రవేశపెట్టిన సేతుబంధన్ స్కీంలో ఆర్ఓబీకి నిధులు తీసుకు వస్తే ఐదేళ్లక్రితం ఎంపిగా తాను ఎలా నిధులు తీసుకువచ్చాడో బీఆర్ఎస్ అభ్యర్థి సమాధానం చెప్పాలన్నారు. మంత్రి పదవి రాగానే పొన్నం ప్రభాకర్ మిడిసిపడుతున్నాడన్నారు. కరీంనగర్‌లో బీజేపీ మెజారిటీతో గెలువడం ఖాయమైపోయిందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండో స్థానం కోసం పోటీ పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదతరులు పాల్గొన్నారు. కరీంన గర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యానారాయణను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు కటకం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయంలో అఖండ నామ సంకీర్తన



అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం నిర్వహించిన సాయి అఖండ నామ సంకీర్తన ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగింది. సాయి ఆఅయంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న సాయి అఖండ నామ సంకీర్తన మొదటి రోజు గురువారం వేద పండితుల పూజ కార్యక్రమంతో ఘనంగా ప్రారంభించారు. సాయి బాబా విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన 1008 కళశాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, రవి చంద్ర, కిషన్, పురుషోత్తంరావు, రాంకిషన్‌రావు, రాజలింగం, తవుటు రాంచంద్రం, తిరుపతి, మారుతి, గుండేటి రాజు ఉన్నారు.

'షట్చక్రం' గ్రంథానికి గంద్ర హనుమంతరావు స్మారక పురస్కారం



షట్చక్రం గ్రంథం, లక్ష్మణ చక్రవర్తి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యుడు, విమర్శకుడు డాక్టర్ లక్ష్మణ చక్ర వర్తి రచించిన 'షట్చక్రం' గ్రంథం గండ్ర హనుమంతరావు స్మారక పురస్కారానికి ఎంపిక యింది. ప్రతియేటా రాష్ట్ర స్థాయిలో కవిత్వ యేతర ప్రక్రియలకు అందించే ఈ పురస్కారానికి 'షట్చక్రం' ఎంపికయినట్లు కమిటీ బాధ్యులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల చివరి వారంలో ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఏప్రిల్ 11: మల్యాల కొత్తపేటలో పోచమ్మకు భక్తులు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ ఆలయంలో ఎస్సీ కాలనీ వాసులు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బోనాల వేడుకలు నిర్వహించగా మహిళలు బోనాలతో గ్రామంలో శోభాయాత్రతో ఆలయానికి వచ్చి పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వేడుకలో ఎస్సీ కాలనీ వాసులతో పాటు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ ప్రాణ ప్రతిష్ఠ

- ఆలయంలో కుంకుమ పూజలు చేసిన మహిళలు



ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో బంగారు మైసమ్మతల్లి ఆలయంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి, అలయం పునర్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు గురువారం వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్ ఆధ్వర్యంలో అలయ ఆవరణలో మహాయజ్ఞాన్ని పూజారి రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వంద మంది మహిళలు కుంకుమ పూజలతో పాటు రుద్రహోమం, మూల మంత్ర హోవనం, శయ్యాధివాస, పూజలు చేశారు. కార్యక్రమాల్లో టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, మున్సిపల్ కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బోద్దుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 11: న్యూమారేడు పాకలో దుప్పిని చంపి మాం సాన్ని విక్రయి స్తున్న ముగ్గురు వ్యక్తుల ను గురువారం గోదావరి ఖని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం రావడం తో టూటౌన్ సీఐ బి.రవీందర్, ఎస్ఐ సనత్‌కుమార్ అక్కడికి చేరుకొని మాంసం విక్రయిస్తున్న లోకిని మల్లేష్, గంట మోహన్, బండారి సురేందర్ లను పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

కంటైనర్‌లో వచ్చి.. రెక్కీ చేసి.. ఏటీఎం చోరీ



సీసీ టీవీ ఫుటేజీతో నిందితుడి గుర్తింపు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్టు చేసిన పోలీసులు

వారంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు. లారీలపై పని చేస్తూ దొంగతనాలు అలవాటు చేసుకున్నారు. మార్చి 18న ఓ కంటైనర్‌తో హుజూరాబాద్‌కు వచ్చారు. శివారు ప్రాంతంలోని ఓ దాబా వద్ద కంటైనర్‌ను ఉంచి పట్టణంలోకి ప్రవేశించారు. రాత్రి వేళలో ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన ఓ కారును, బైకు దొంగిలించారు. వాటిపై ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చారు. అక్కడి పరిస్థితులను గమనించి వెళ్లిపోయారు. తెల్లవారు జామున మళ్లీ ఏటీఎం వద్దకు సీసీ కెమెరాపై నల్ల రంగు స్ప్రే చేశారు. అనంతరం గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను బద్దలు కొట్టి నగదును చోరీ చేసి కారు, బైక్‌పై పారిపోయారు. తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలి కంటైనర్ వద్దకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.. ఎటువంటి ఆధారాలు లేకుండా సవాలుగా మారిన ఈ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు.

హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన ముఠాలోని ఓ సభ్యుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సబంధించిన వివరాలను హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో ఏసీపీ శ్రీనివాస్‌జీ గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా మార్చి 18 హుజూరాబాద్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారన్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు చోరీ జరిగిన రోజు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిందని తెలిపారు.

ఆర్‌జే11 జీబీ 7370 అనే కంటైనర్ అనుమానాస్పదంగా కనిపించిందని, ఆ కంటైనర్ పక్కన ముషారఫ్ అనే వ్యక్తిని బృందంలోని సభ్యులు గుర్తించారన్నారు. బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే కంటైనర్ కనిపించిందని, అందులోని వ్యక్తిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని ఏసీపీ చెప్పారు. మార్చి 18న హర్యాణాకు చెందిన ముషారఫ్, అతని సోదరుడు సపత్, ఫరీద్, ఢిల్లీకి చెందిన అఫ్తాబ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాజీద్ ఆర్‌జే11జీబీ7370అనే కంటైనర్ లారీలో హుజూరాబాద్ శివారులోని ఓ దాబాకు వచ్చారన్నారు. అక్కడ లారీని నిలిపి పట్టణంలోకి వచ్చి ఓ కారు, మోటార్ సైకిల్‌ను దొంగతనం చేశారన్నారు. ఆ వాహనాలపై తిరుగుతూ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రెక్కీ నిర్వహించారని తెలిపారు.

అక్కడి నుంచి వెళ్లిపోయి తెల్లవారు జామున ఏటీఎం వద్దకు వచ్చి సీసీ కెమెరాకు నల్ల రంగు స్ప్రే చేశారని చెప్పారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి 8.64 లక్షల రూపాయలు దోచుకొని తుమ్మనపల్లి శివారులో వాహనాలను వదిలిపెట్టి కంటైనర్ లారీలో పారిపోయారన్నారు. బుధవారం వాహన తనిఖీల్లో ముషారఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు వివరాలన్నీ వెల్లడించాడన్నారు. ముషారఫ్ వద్ద నుంచి 60 వేల రూపాయలు, కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మిగితా నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ బొల్లం రమేష్, ఎస్ఐ సాంబయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు, నెల్లి మోహన్, అవినాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

నేతన్నలకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమల సంక్షోభాన్ని నివారిం చేందుకు నేతన్నలకు ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామిచ్చారని, త్వరగా ప్రభుత్వ ఆర్డర్లను అందించి నేతన్నలను ఆదుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు బుధ వారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయంలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సిరిసిల్లకు చెందిన జేఏసీ నాయకులతోపాటు వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రలల్లో నెలకొన్న సమస్యలతోపాటు బతుకమ్మ చీరలు, యారన్ సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీతోపాటు వివిధ సమస్యలపై డైరెక్టర్ అలుగు వర్షిణికి వినతి పత్రాన్ని అందించామని జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం కరీంనగర్‌లో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి డైరెక్టర్ అలుగు వర్షిణికు చెప్పిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌లు మూషం రమేష్, పంతం రవి, సభ్యులు కూరపాటి రమేష్, మండల సత్యం, మంచె శ్రీనివాస్, తాటిపాముల దామోదర్, గోలి వెంకటరమణ, సిరిసిల్ల రవీందర్, సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, వేముల దామోదర్, పిస్క మధు, కోడం రమణ, అశోక్, గౌడరాజు, గోనే పర్శరా ములు, ఏనుగుల ఎల్లయ్య, బండారి అశోక్, నక్క దేవదాస్, గుండు రమేష్, గోవిందు రవి తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులు సీజ్



వైద్యుడికి నోటీస్ ఇస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11: రా జన్న సిరిసిల్ల జిల్లాలోని మూడు ప్రైవేటు ఆస్పత్రుల ప్రసూతి గదులను(లేబర్ రూంలు)గురు వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వెద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు మాట్లాడారు. 202 3-24లో జిల్లాలో 100 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా మాత్రమే నిర్వహించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సరయు ఆస్పత్రి, వేములవాడలోని అమృత నర్సింగ్ హోమ్, వాసుదేవ ఆ స్పత్రుల్లో వంద శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారా చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు ఆస్పత్రుల్లోని ప్రసూతి గదులు సీజ్ చేశామని తెలిపారు. ఆస్పత్రుల వైద్యులకు, నిర్వాహకులను నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూడు ఆస్పత్రుల్లో ప్రసవాలు నిర్వహించడానికి వీలులేదని తెలిపారు. నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వెద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారులు శ్రీరాములు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రసూతి గదిని సీజ్ చేస్తున్న అధికారులు

పరిహారం ఇచ్చిన తరువాతే భవనాలను నిర్మించాలి

- పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: పరిహారం ఇచ్చిన తర్వాతనే మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో చేపట్టిన మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణ పనులను రైతులు బుధవారం అడ్డుకున్నారు. గురువారం ఉదయం తిరిగి పనులు ప్రారంభించగా రైతులు, వారి కుటుంబ సభ్యులు సుమారు వంద మంది పనులను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టౌన్‌సీఐ రఘుపతితో పాటు నలుగురు ఎస్‌ఐలు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకోని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తమ భూములను తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తోందని, కాంట్రాక్టర్ తమపై ఇష్టానుసారంగా మాట్లాడడంతోపాటు దాడులకు పాల్పడుతున్నాండని రైతులు సీఐకు వివరించారు. దీంతో సీఐ రఘుపతి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దాడులు చేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి వస్తే చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చూద్దామని చెప్పడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్యరెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఉలిసె తిరుపతి, చెన్నమనేని కమలాకర్‌రావు, అకునూరి బాలరాజు, అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజం, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

భగత్‌నగర్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. గురువారం నగరలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కొండగట్టు అంజన్న మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లి అసత్య వ్యాఖ్యలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థికరువయ్యాడని, ఫ్రస్టేషన్‌లో ఉండి అలా మాట్లాడుతున్నారన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై పుస్తకం ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేశారన్నారు. ఎంపీ నియోజకవర్గ పరిధిలో 12 వేల కోట్ల రూపాయల అభివృద్ధి చేశారన్నారు. ఆ పుస్తకాన్ని మంత్రికి పోస్టులో పంపిస్తామని చదువుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, కేటీఆర్, కవితపై ఎందుకు మాట్లాడడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడితే మంచిదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, మాజీ ఎంపిపి వాసాల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంత లకళ్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, బండ రమణారెడ్డి, మామిడి రమేష్, అవదుర్తి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.



పార్లమెంట్ అభివృద్ధిపై ముద్రించిన పుస్తకాన్ని చూపిస్తున్న రాణి రుద్రమ

తండ్రి మృతితో మనస్తాపం.. కుమారుడి ఆత్మహత్య



విశ్వతేజ మృతదేహం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 11: మండలంలోని అయిలా పూర్ గ్రామానికి చెందిన మారంపల్లి విశ్వతేజ (22) అనే యువకుడు తన తండ్రి మృతికి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వతేజ తండ్రి గంగధర్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి విశ్వతేజ మనస్థాపానికి గురై తరచు బాధపడేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో తన బెడ్‌రూంలో ఉరేసకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విశ్వతేజ తల్లి చిన్న లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దాత నిశాంత్‌రెడ్డి

గొల్లపల్లి, ఏప్రిల్ 11: గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌లోని శ్రీ రామ లింగేశ్వర స్వామి జాతర ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు గురువారం హోరా..హోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 19 ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొనగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. పోటీలను ఆలయ చైర్మన్ తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ కోమురయ్య జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పోటిల్లో ప్రథమ విజేతగా ఎండపల్లి మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల శివకృష్ణ ఎడ్లబండి నిలవగా, దాత గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి-దీప్తి దంపతులు అందించిన 2.5 గ్రాముల బంగారం గెలుచుకున్నారు. ద్వితీయ, తృతీయ బహుమతులుగా 100, 50 గ్రాముల వెండిని దాతలు బంగిమరం శంకరయ్య జ్ఞాపకార్థం బంగిమరం లలిత-శివకుమార్, బంగిమరం సంతోషిణి-శివప్రసాద్, కోట వెంకన్న జ్ఞాపకార్థం కోట సుజాత-అశోక్ దంపతులు అందించిన గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామీయా, ఎండపెల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మెట్‌పల్లి అజయ్ ఇద్దరు సమానంగా పంచుకున్నారు. అనంతరం విజేతలకు దాతలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమీటీ చైర్మన్ దాసరి తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ సింగారపు కోమురయ్య, తాజామాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, నాయకులు పురంశెట్టి వెంకటేశం, శివకుమార్, వేణు, రాజయ్య, మహేష్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి


నివాళులర్పిస్తున్న బండి సంజయ్



పూలేకు నివాళులర్పిస్తున్న వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు


పూలేకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 11: జిల్లా వ్యాప్తంగా జ్యోతిరావుపూలే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ నగరంలోని పూలే విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అణచివేతపై తిరుగుబాటు చేసిన మహనీయుడన్నారు. పేదల జీవితాల్లో అక్షర వెలుగులు నింపాడన్నారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి విద్యాఉద్యమాన్ని ప్రారంభించి 52 పాఠశాలల్లో పేదలకు అక్షర జ్ఞానాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాణి రుద్రమాదేవి ఉన్నారు.

●కరీంనగర్ టౌన్: సమాజాన్ని మేల్కొలిపిన మహాత్మా జ్యోతిరావు పూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కోతిరాంపూర్‌లోని జ్యోతిరావు విగ్రహం వద్ద జరిగిన పూలే జయంతి వేడుకల్లో హాజరై పూలే విగ్రహానికి మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్.రూప్‌సింగ్, లోకబాపురెడ్డి, ఐలేందర్‌యాదవ్, లింగమూర్తి, ఆది మల్లేశం పటేల్, రమేశ్, సంపత్ పాల్గొన్నారు.

● యునైటెడ్ ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఫోరం కార్యాలయంలో మహాత్మా జ్యోతిబాపూలేకు ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎఫ్ జావిద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎగదండి బబిత, బొడ్డుపల్లి రాజమౌళి తదితరులున్నారు.

● గణేశ్‌నగర్: పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. డీసీసీ కార్యాలయంతో పాటు నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పురుమల్ల శ్రీనివాస్ , నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, వైద్యులు అంజన్ కుమార్ ఉన్నారు.

● భగత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ సుచరితలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పూలేకు నివాళులుఅర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్ ఉన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత పూలేకు నివాళులర్పించారు.

● గణేశ్‌నగర్: టీఎస్ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో పూలే జయంతి నిర్వహించారు. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆవరణలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మలోత్ శివ,సందీప్,బొగేశ్,సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్షుడు అరవింద్ పాల్గొన్నారు, తెలంగాణ చౌక్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) చేతివృత్తిదారుల సంఘం, గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని రాష్ట్ర అధ్యక్షులు పూసాల సంపత్ ఘనంగా నిర్వహించారు.

బీసీ సంఘాల అఖిలపక్ష నాయకులు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాచమల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, కేశిపెద్ది శ్రీధర్‌రాజ్,కనకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●హుజూరాబాద్ లీగల్: హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, న్యాయవాదులు సాయన్న, ముక్కెర రాజు ఉన్నారు.

● సైదాపూర్: మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ రవీందర్ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

●జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జ్యోతిబాపూలేకు నివాళులు అర్పించారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీసీ సంఘం అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో గురువారం ఆరెపల్లి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పూలేకు నివాళులర్పించారు.

● చొప్పదండి: అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●రామడుగు: గోపాల్‌రావుపేటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రేణికుంట అశోక్ పాల్గొన్నారు.

● చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, ఉల్లంపల్లి గ్రామాల్లో జ్యోతిబాపూలే విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఉన్నారు.


నివాళులు అర్పిస్తున్న ఆర్టీసీ అధికారులు


ఉల్లంపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు


హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న ప్రణవ్



నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక కార్ఖాన గడ్డలోగల అంబేడ్కర్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బైరం కుమార్, ప్రధాన కార్యదర్శి మాడెపు హరిబాబు, ఉపాధ్యక్షులు గొర్రె వాసు, దొంత కనకయ్య, సహాయ కార్యదర్శి పెదారంగం పూర్ణ చందర్, కోశాధికారి కర్ర నవీన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రొడ్డ రవీందర్, ములకల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణ పూజలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 11: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం హెలీప్యాడ్ గ్రౌండ్ ప్రక్కన గల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజారోహణ, ద్వార తోరణ పూజలు ఘనంగా జరిగాయి. మేయర్ సునీల్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. గరుడ ధ్వజంతో పాటు యాగశాల, ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపేందర్, వేంకట్‌రావు, ప్రవీణ్, నాగరాజు, ప్రభాకర్, ఆలయ కమిటీ బాధ్యులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

అన్నదానం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 11: రంజాన్‌ను పురస్కరించుకొని గురువారం నాయకుడు అమీన్ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపల్లి నియోజకవర్గ నాయకుడు ఆసంపెల్లి శ్రీనివాస్, పురమల్ల శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమీన్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడమే కాకుండా ప్రతి వారం నిర్వహిస్తామనడం ఆదర్శనీయమని నాయకులు ఆసంపెల్లి శ్రీనివాస్, పురమల్ల శ్రీనివాస్ ప్రశంసించారు.

రంజాన్ శుభాకాంక్షలు


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 11: రంజాన్ పండుగ సందర్భంగా గురువారం రేకుర్తిలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలను కలిసిన సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజ్, యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, నాయకులు అమీర్, చాంద్, జమల్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో పూలే జయంతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలోని టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో మహాత్మాజ్యోతిబాపూలే జయంతిని అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, రాష్ట్ర నాయకుడు కల్యాడపు ఆగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజేశం, తీగుట్ల రమేశ్, రొడ్డ శ్రీనివాస్, బొలుమల్ల సదానందం, రొడ్డ శ్రీధర్, ఎర్రోజోఉ హయగ్రీవాచారి తదితరులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా హుజూరాబాద్ పట్టణంతో పాటు, బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి


హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

● హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నేదురు తిరుపతిరెడ్డి కుమార్తె భువన మేధ మృతి చెందగా వారి కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి మాదం విజయ్‌కుమార్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. ఆయన వెంట నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ తదితరులు ఉన్నారు.

చెక్ అందజేత

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 11: మండలంలోని శాలపల్లి గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ఆ గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొడిగూటి ప్రవీణ్ రూ. 21 వేల చెక్కును మజీద్ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయననుపలువురు అభినందించారు.

కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా ఇర్ఫాన్


ఇర్ఫాన్

మానకొండూర్, ఏప్రిల్ 11: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల మైనార్టీ విభాగం పరిశీలకుడిగా మానకొండూర్‌కు చెందిన ఎండీ ఇర్ఫాన్‌ను నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు ఫర్హాన్ ఆజ్మీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకర్తలను కలుపుకుని వెళ్తానని చెప్పారు. పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.

మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలి

- పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పేరాల మానసరెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 11: రాజకీయాల్లో మార్పు కోసం చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని కరీంనగర్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పేరాల మానసరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను సివిల్ ఇంజనీర్ చదువు పూర్తి చేసి, ఆ రంగంలో రాణిస్తున్నానని తెలిపారు. నేటి రాజకీయాలను చూసి మార్పు కోసం రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తనది సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామమని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టును తాను సందర్శించి అందులో ఉన్న లోపాలు ఆనాడు ఎత్తిచూపానని అన్నారు. లోపాల కారణంగానే ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేశారని అన్నారు. రాజకీయాలకు కులమతాలను ముడిపెట్టడం సరైంది కాదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని దానిని తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు. పంట పండించిన రైతు తన పంటకు ధరను నిర్ణయించే స్థాయికి అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో కన్నబోయిన వంశీ, పలమాని మల్లేశం, బండారపు మల్లయ్య, బీరవేణి యుకేశ్, బోళ్ళ స్వామి, మడ్డి ప్రశాంత్, మడ్డి రాకేశ్, పైడిపల్లి రాకేశ్, పైడిపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

పోరాడే నాయకుడిని ఆదరించాలి

గంగాధర, ఏప్రిల్ 11: ప్రజాసమస్యలపై పోరాడే ప్రజానాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఆదరించాలని ఆయన సతీమని మాదవి కోరారు. గురువారం ఆమె గంగాధర మండలం ర్యాలపల్లి, చర్లపల్లి(ఆర్), కొండయ్యపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధికూలీలతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతుక, ప్రజల సమస్యలపై పోరాడే నాయకుడు వినోద్‌కుమార్‌ను ఆశీర్వదించి ఓటేయాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, ఎంపీటీసీ రాజిరెడ్డి, బోయినపల్లి మాజీ ఎంపీపీ భాగ్యలత తదితరులు ఉన్నారు.

శ్రీరామ తారక నామమహామంత్ర జపకోటి యజ్ఞం


శంకరపట్నంలో మాట్లాడుతున్న స్వాములు

శంకరపట్నం, ఏప్రిల్ 11: శంకరపట్నం మండలంలోని శ్రీబ్రహ్మా విద్యాశ్రమంలో స్వాములు శ్రీరామ తారక నామమహామంత్ర జపకోటి యజ్ఞం అవంగానందగిరి స్వాముల అధ్యక్షతన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని శక్తి అనంతమైందన్నారు. మానవులు దాన, త్యాగ గుణం, సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గురువులు ఓంకారం, బాబన్న, రాజయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, సత్యనారాయణ తది తరులు పాల్గొన్నారు.

దళిత సమ్మేళనానికి ఏర్పాట్లు


మాట్లాడుతున్న దళిత మోర్చా నాయకులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 11: మానకొండూర్‌లో ఏప్రిల్ నెలలో దళిత సమ్మేళనం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం మానకొండూర్ నియోజకవర్గ దళిత మోర్చ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమ్మేళనానికి జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్ శింగ్ ఆర్యాతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హాజరు కానున్నట్లు చెప్పారు. బీజేపీ ప్రభుత్వం దళితులకు అందిస్తున్న పథకాలను గ్రామాల్లోకి వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు పులుమల్ల ప్రసాద్, ఎల్కపల్లి స్వామి, కనకం సాగర్, జైపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి


డంపింగ్‌యార్డు వద్ద సీపీఎం నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 11: ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్న డంపింగ్ యార్డును తరలించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. గురువారం బైపాస్ రోడ్‌లోని డంపింగ్ యార్డును సీపీఎం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో డంపింగ్ యార్డు తగలబడి పోతుందని దీంతో దట్టమైన పొగలు వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్మార్ట్‌సిటీలో డంపింగ్ యార్డుతో ఇన్ని అవస్థలు పడుతున్నా నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పున్నం రవి, జి తిరుపతి, కొంపెల్లి నాగర్, నాయకులు కోనేటి నాగమణి, ఆర్ శ్రీనివాస్, కనకరాజు, చెలికాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల బరిలో ధర్మసమాజ్ పార్టీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 11: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల బరిలో ధర్మసమాజ్ పార్టీ నిలుస్తుందని పార్టీ జిల్లా ఇన్‌చార్జి చిలువేరు శ్రీకాంత్ తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్, కాన్షీరాం ఆశయాలను కొనసాగించే ఏకైక పార్టీ ధర్మసమాజ్‌పార్టీ అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ధర్మసమాజ్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో బహుజన రాజ్యం ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు జలగం సాధన, ప్రధాన కార్యదర్శి తల్లా నరేష్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి ఆరెల్లి బాబు, సదానందం, అనిల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


శంకరపట్నంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

హుజూరాబాద్, ఏప్రిల్ 11: హుజూరాబాద్ డివిజన్‌లో ముస్లింలు రంజాన్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా, ఏక్‌మినార్‌లలో ముస్లిం మతపెద్దలు, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ముస్లింలు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఈద్గాల్లో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు దేశిని కోటి, కౌన్సిలర్ దిడ్డి రాము, కసుబోజుల వెంకన్న, సుంకరి రమేశ్, ఎండీ సజ్జు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అంకూశవలి, సయ్యద్ సమీర్, ఈద్గా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఇక్బాల్, కార్య నిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సైదాపూర్: మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థన అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వీణవంక: మండల కేంద్రంతో పాటు చల్లూరులో రంజాన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌లు ఈద్గా వద్దకు చేరుకొని ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడునందగిరి రవీంద్రాచారి, జిల్లా కార్యదర్శి సంపత్, గౌస్‌ఖాన్, సయ్యద్ మెయినోద్దీన్, ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర, గర్షకుర్తి, మధురానగర్, ఆచంపల్లి గ్రామాల్లో ఈద్గల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ సందర్భంగా మధురానగర్‌లో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

చొప్పదండి: చొప్పదండిలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రామడుగు: రామడుగు, దేశ్‌రాజ్‌పల్లి, వెలిచాల, గుండి గ్రామాలలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణారెడ్డి, శ్యాం, జితేందర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

చిగురుమామిడి: మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎండి యాసీన్, సర్వర్‌పాషా, అలీ, సయ్యద్ షరిష్, సుక్క షరిఫ్ తదితరులు పాల్గొన్నారు.


మానకొండూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 11: కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం ఆయన గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎకరాకు 15వేలు అందిన రైతులను ఓట్లు అడగమని గతంలో 10వేలు రైతు పెట్టుబడి పొందిన రైతులనే ఓట్లడుగుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పొందిన వారిని ఓట్లడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతేనని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మహిపాల్‌రావు, వేముల అంజి, అజయ్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేవైఎం సత్తాచాటాలి

చొప్పదండి, ఏప్రిల్ 11: రాబోయే ఎన్నికల్లో బీజేవైఎం సత్తాచాటాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ అన్నారు. గురువారం బీజేవైఎం చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ పరిధిలో బీజేపీ బలంగా ఉందని, యువత బీజేపీ, మోదీ ప్రభుత్వం, ఎంపీ బండి సంజయ్ వైపే ఉన్నారని తెలిపారు. కార్యకర్తలు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వెళ్లి వివరించాలని సూచించారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

దేశ రక్షకులుగా ఉండాలి

చొప్పదండి, ఏప్రిల్ 11: హిందూ సమాజం దేశ రక్షకులుగా ఉండాలని జిల్లా భజరంగ్‌దళ్ సంయోజక్ కన్నం శంకర్ అన్నారు. చొప్పదండిలో వీహెచ్‌పి, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశలో ఆయన మాట్లాడారు. హిందూ సమాజం అన్ని పార్టీలకు అతీతంగా ఉంటూ దేశ రక్షకులుగా, సమాజ సేవకులుగా ముందుండి నడిపించాలని అన్నారు. మే 18 నుంచి 25 వరకు సిద్దిపేటలో భజరంగ్‌దళ్ శిక్షణ తరగతులు జరుగుతుతాయని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు పడకంటి కృష్ణ, మొలుమూరి రమేష్, సిరిపురం శ్రీనివాస్, దండే మహేష్, దూస రాము, చిల్ల శ్రావణ్, చిల్ల అనూష్, జిట్ట కుమార్, గాంగ్ సంపత్, పొన్నం అజయ్, కొత్త అఖిల్, సిద్ధార్థ్, తదితరులు పాల్గొన్నారు.